ఉపరాగం

సి. రామచంద్రరావు

"వన్ నో ట్రంప్"

"నో బిడ్"

"త్రీ స్పేడ్స్"

"నో బిడ్"

"ఫోర్ నో ట్రంప్స్"

"నో బిడ్"

"ఫయివ్ హార్ట్స్"

"నో బిడ్"

"సెవెన్ స్పేడ్స్"

రంగారావు కళావరు పది ఆడేడు. జస్టిస్ జగన్నాథం పద్దెనిమిది పాయింట్ల డమ్మీ చెయ్యి టేబిల్ మీద పరుస్తూ, అయిదు స్పేడ్ ముక్కల్ని చూపించి పార్ట్నర్ని అడిగాడు.

"ఎలా వుంది?"

"థాంక్యూ పార్ట్నర్!" అంది మిసెస్ జగన్నాథం.

బేరరు ట్రే తీసుకువచ్చాడు. ట్రేలో అప్పుడే వచ్చిన ఉత్తరాలు వున్నాయి. జస్టిస్ జగన్నాథం గబగబా అన్నిటిమీద దస్తూరీ చూసి ఒక కవరు తీసి చింపాడు.

"ఎక్కణ్ణుంచి?" మిసెస్ జగన్నాథ

అడిగింది.

"ముందు నీ గ్రాండ్ స్లామ్ కానియ్, చెప్తాను."

"ఏం పరవాలేదు చెప్పు.

"అదేటప్పుడు ఇవన్నీ పట్టించుకుంటే నీకు బ్రిడ్జి వచ్చినట్టే."

జస్టిస్ జగన్నాధం నవ్వేడు. ఆయన బ్రిడ్జిలో ఆరితేరిన ఆటగాడు. మిసెస్ జగన్నాధం కొంతకాలం క్రితమే నేర్చుకోడం ప్రారంభించింది. క్లబ్బులో ఆడాలని ఆవిడకి సరదా. అయితే అది అంత తేలికయిన విషయం కాదు. బ్రిడ్జి ఆటగాళ్ళు ఏం చెయ్యమన్నా చేస్తారుగాని స్నేహితులు కానీ, ఎవరుకానీ, తప్పు ఆట ఆడితేమటుకు విమర్శించకుండా వుండలేరు. నేర్చుకునేవాళ్ళతో ఆడడం చాలామందికి ఇష్టం వుండదు. కొత్తగా నేర్చుకునే రోజుల్లో వీళ్ళుపడే భయం, సందేహం ఏ కొద్దిమందికో గాని జ్ఞాపకం వుండదు. జ్ఞాపకం వున్నవాళ్ళలో కూడా ఒక రకం మనస్తత్వం అలవడినట్టు కనిపిస్తుంది. ఒకప్పుడు విమర్శకి ఎంత నొచ్చుకున్నా, తాము ఒగ్గి నేర్చుకున్నారు కాబట్టి కొత్తగా నేర్చుకొనే వాళ్ళుకూడా అదేవిధంగా నెగ్గుకుని రావలసిందే! ఏమయినా మిసెస్ జగన్నాధం క్లబ్బులో బ్రిడ్జి ఆడడానికి ధైర్యం చెయ్యలేదు. ఇంటిదగ్గిర స్నేహితుల్తో ఆడడంతో ప్రారంభం చేసింది. రంగారావూ, ఆయన భార్యకూడా ఆట నేర్చుకుంటున్నవాళ్ళే. అందుచేత రోజూ రంగారావు ఇంట్లోనో జడ్జీగారి ఇంట్లోనో ఆట సాగుతుంది. జస్టిస్ జగన్నాధం ఎవరెవరు ఎప్పుడు తప్పు ఆడేరో విడమర్చి చెప్పి, ఎలా ఆడాలో నేర్పుతాడు.

"పోనీలే" మిసెస్ జగన్నాధం కోపం అభినయించి ఆటలో పడిపోయింది.

జస్టిస్ జగన్నాధం టేబిల్ వదిలి దూరంగా కిటికీ దగ్గిరవున్న సోఫాలో కూర్చుని ఉత్తరం చదవడం ప్రారంభించాడు.

"స్లామ్ నెగ్గాం" సంతోషంగా అరిచింది మిసెస్ జగన్నాధం.

"అంతేకాదు. దాంతో స్ట్రెయిట్ రబ్బర్‌కూడా గెలిచారు" స్కోర్ పేడ్ మీద అంకెల్ని కూడుతూ మిసెస్ రంగారావు అంది.

"డబ్బుపోతే పోయింది. దాని విలువకి టీ అయినా తాగుదాం" అన్నాడు రంగారావు ట్రేలో కేక్ తీసుకుంటూ.

"పదహారు పాయింట్లు! ఇలా అయితే మనం ఆస్తులు అమ్ముకోవలసిందే" అంది మిసెస్ రంగారావు.

వాళ్ళు పాయింటుకి ఇరవై నయాపైసల చొప్పున ఆడతారు. అది స్వల్పం అని మిసెస్ రంగారావు అభిప్రాయం. జడ్జీగారు మాత్రం దాన్ని పెంచడానికి ససేమిరా ఒప్పుకోరు. ఇరవై నయాపైసలవరకూ అయితే పరవాలేదు. అంతకు మించితే జూదం చట్టవిరుద్ధం

"ఇదుగో టైలరూ జేబులు కత్తిరించడం నేర్పుతావ్

అని ఆయన అంతరాత్మ ఘోషిస్తుంది.

టీ కలుపుతున్న మిసెస్ జగన్నాథానికి ఉత్తరం విషయం జ్ఞాపకం వొచ్చింది

"ఉత్తరం ఎక్కణ్ణుంచి జగన్" ఆమె అడిగింది

"నిర్మల్ రాసింది."

"ఏమిటి విశేషాలు?"

"ఎప్పటి గోలే. అతనికి ఉద్యోగం చూడమంటుంది."

"పాపం. అంతగా అడుగుతుంటే సాయం చెయ్యకూడదూ?"

"ఉద్యోగాలు ఇవ్వడానికి నా చేతుల్లో వున్నయ్యా?"

జస్టిస్ జగన్నాథం విసుక్కున్నాడు.

"ఎవరికి ఉద్యోగం?" రంగారావు అడిగాడు.

"వెంకట్‌కి" మిసెస్ జగన్నాథం సమాధానం ఇచ్చింది.

"వెంకట్ ఎవరు,"

"మా అల్లుడు, నిర్మల్ మొగుడు."

వాళ్ళ అల్లుడు రాజమండ్రిలో 'లా' ప్రాక్టీసు చేస్తున్నాడని రంగారావుకి తెలుసును. కాని అతని పేరు జ్ఞాపకం రాలేదు.

అందరూ నిర్మల్ మొగుడనే అంటారు.

"నిజంగా కావాలంటే అతనికి ఉద్యోగమే దొరకదా?" అన్నాడు రంగారావు.

"దొరక్కే ఇంత తాపత్రయం."

మిసెస్ జగన్నాథం మాటల్లో మొగుడుమీద సాధింపు వుంది.

"ఇక్కడికి రమ్మనండి. నే నిస్తాను" అన్నాడు రంగారావు

రంగారావు ఫోర్బ్స్ ఎండ్ మెడీసన్ కంపెనీకి జనరల్ మేనేజరు. అతనూ,

జగన్నాధం పాతికేళ్ళ క్రితం బార్-ఎట్-లా ఇంగ్లండులో ఒకే 'ఇన్' నుంచి చదువుకున్నారు. జగన్నాధం మూడేళ్ళ క్రితం హైకోర్టుజడ్జి అయి హైదరాబాదు వచ్చినప్పుడు, పాత పరిచయాన్ని పుర స్కరించుకొని రంగారావూ, భార్యా, జడ్జి గారింటికి వెళ్ళేరు. జగన్నాధం దంపతు లకీ, వాళ్ళకీ బాగా కలిసి స్నేహం వృద్ధి పొందింది.

''థాంక్స్ రంగా!'' అన్నాడు జస్టిస్ జగన్నాధం. ఉద్యోగం వేయించాలని వుంటే నీతో ఎప్పుడో సంప్రదించేవాణ్ణి. వెంకట్ ఉద్యోగం చెయ్యడం నా కిష్టం లేదు.

''ఏం?'' అన్నాడు రంగారావు.

''అతను లాయరుగా పైకి వొస్తాడని నా నమ్మకం.''

''అయితే 'లా' ని అంటిపెట్టుకుని వుండవలసిందే. ఉద్యోగాలు చేసి మనం సంపాదించే దెంత? దాచేదెంత?''

రంగారావు మాటల్లో తన ఉద్యోగం గురించి తృప్తి మర్మంగా దాక్కుని వుంది. అతనికి నెలకి అయిదువేల రూపా యల జీతం వొస్తుంది. కారూ, ఇల్లూ కంపెనీదే. ఇదికాక బోలెడు బోనసు.

''డబ్బుమాట సరే రంగా! వెంకట్ లాటివాడు ఆఫీసు బల్లముందు కూచుని కాగితాలమీద సంతకాలుచేస్తూ కాలం గడిపేయడం అన్యాయం.''

''యువర్ లార్డ్ - షిప్‌కి మా ఉద్యోగాలమీద సరయిన అభిప్రాయం వున్నట్టు లేదు'' రంగారావు నవ్వేడు.

''సారీ రంగా!'' అన్నాడు జస్టిస్ జగన్నాధం. ''అన్ని ఉద్యోగాల గురించీ నే ననడంలేదు. మన పలుకుబడి వుపయోగించి వేయించిన ఉద్యోగాల్లో అంతకంటే ఏం పని వుంటుంది?''

''నిజమే'' అన్నాడు రంగారావు.

''మన పలుకుబడివల్ల వచ్చిందని జీతం ఇవ్వడం మానెయ్యరు కదా!''

మిసెస్ జగన్నాధం అడ్డు తగిలింది. ఆమె మాటల్లో వ్యంగ్యం జస్టిస్ జగన్నాధాన్ని చికాకు పరిచింది.

''జీతం, జీతం'' అన్నాడు.

''అంతేకాదు ఎయిర్ కండిషన్డ్ ఆఫీసూ. విదేశాల్లో విహారాలూ, ఇంకా ఏమిటి రంగా?''

రంగారావువైపు చూసింది మిసెస్ జగన్నాధం.

ఫోర్బ్స్ ఎండ్ మెడీసన్ కంపెనీకి ఎయిర్ కండిషన్డ్ ఆఫీసు గదులున్నాయి. ఏడాదికొక నెల కంపెనీ ఖర్చుమీద భార్యా పిల్లలతో సహా రంగారావు ఊటీయో, కాశ్మీరో, ముస్సోరీయో ఏదో విలాస స్థలానికి వెళుతూవుంటాడు. మూడేళ్ళ కొకసారి ఆరు నెల్ల పాటు విదేశాల్లో సెలవు గడపడానికి కంపెనీ ఖర్చు భరిస్తుంది ఇంకా ఇటువంటి సౌకర్యాలెన్నో కంపెనీ అతనికి కల్పిస్తుంది.

రంగారావు మాట్లాడలేదు; చిరునవ్వు

నవ్వేడు.

"నీ అల్లుడికి మొదటే జనరల్ మేనేజర్ ఉద్యోగం వేయించేస్తావా ఏమిటి?" అన్నాడు జస్టిస్ జగన్నాధం.

"సుశీ తలుచుకుంటే వేయించలేదా!" నవ్వేడు రంగారావు.

"అసిస్టెంటుకి మాత్రం ఏమంత తక్కువ రాదుగా!" అంది మిసెస్ జగన్నాధం.

అది నిజమే. బ్రిటిష్ పద్ధతుల్లో నడిచే కంపెనీలకి రెండు గ్రేడ్లు వుంటాయి. కవెనెంటెడ్ గ్రేడులో ఆఫీసర్లుగానే తీసుకుంటారు. అన్ కవెనెంటెడ్ గ్రేడ్‌లో గుమాస్తాలూ, వాళ్లూ వుంటారు. అసిస్టెంట్ కవెనెంటెడ్ ఆఫీసరు, దగ్గర దగ్గర వెయ్యిరూపాయల జీతం వస్తుంది. జనరల్ మేనేజరుకి మూడేళ్ళ కొకసారి విదేశాల్లో సెలవు ఇస్తే అసిస్టెంటుకి అయిదేళ్ళ కొకసారి ఇస్తారు. అలాగే అన్ని సౌకర్యాలూను.

"వెంకట్ ఇప్పుడే అంత సంపాదించలేకపోవచ్చు. కాని ముందుముందు ఉద్యోగాల్లో ఎవరూ సంపాదించలేనంత సంపాదిస్తాడు. నా మాట నమ్ము. ఈ విషయాల్లో కాస్తో కూస్తో అనుభవం ఉన్నవాణ్ణి" అన్నాడు జస్టిస్ జగన్నాధం.

"సంపాదించవలసిందే ఆ మహా పట్నంలో" అంది మిసెస్ జగన్నాధం.

"ఏం. అక్కడమాత్రం సంపాదించిన వాళ్ళు లేరా?" అడిగాడు జస్టిస్ జగన్నాధం.

"సుశీ చెప్పిందికూడా నిజమే" అన్నాడు రంగారావు. "అక్కడ అభివృద్ధికి ఏమంత అవకాశం వుంటుంది? హైకోర్టుకి వొచ్చెయ్యకూడదూ?"

"కొంతకాలం ఆగి వస్తాడు."

"ఏం?"

"ఇప్పుడిప్పుడే అక్కడ పేరు సంపాదించుకుంటున్నాడు. ఇంకొక రెండు మూడేళ్లు వుండి దాన్ని స్థిరం చేసుకుంటే హైకోర్టుకి వచ్చింతర్వాత ఆవైపు పనంతా తనకే వస్తుంది."

"నీకిచ్చినమ్మకమే నీకు" అంది మిసెస్ జగన్నాధం. మొదటిసారి వెంకటరమణని చూసినప్పుడే జగన్నాధానికి అతని సామర్థ్యంతో నమ్మకం కుదిరింది. అప్పుడు జగన్నాధం రాజమండ్రిలో డిస్ట్రిక్టు ఎండ్ సెషన్స్ జడ్జీగా వుండేవాడు. వెంకటరమణ తన సమక్షంలో ముద్దాయి తరపున లాయరుగా వాదించాడు. ఖూనీకేసు. పల్లెటూళ్ళో రెండుపక్షాల మధ్య కక్షలు. ముద్దాయి ముగ్గురి మనుష్యుల్ని నిష్కారణంగా పొట్టని పెట్టుకున్నాడని ప్రాసిక్యూషన్ కేసు. ఉరిశిక్ష తప్పితే అదృష్టమే అనుకున్నారంతా. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కి సహాయం చెయ్యడానికి హేమాహేమీలయిన లాయర్లు. ప్రాసిక్యూషన్ కేసు చాలా కట్టుదిట్టంగా తయారుచేశారు. అయితే 'కుర్రప్లీడర్లు' తేలిగ్గా వొదిలే రకం కాదని అందరికి గట్టి

నమ్మకం.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముద్దాయిమీద ఆరోపణలు ముగించిన తరవాత వెంకటరమణ తన క్లయింటు తరపున వాదించడానికి లేచి కోర్టంతా ప్రతిధ్వనించేలా ముద్దాయి నిర్దోషి అని ఉద్ఘాటించాడు. ప్రాసిక్యూషన్ కేసు అబద్ధాలపుట్ట అన్నాడు. న్యాయాన్ని ఉద్ధరించడానికి ఏర్పాటయిన పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసులు తెచ్చిన ప్రతి కేసూ గెలవడమే ఆశయంగా పెట్టుకుని నిజానిజాలు కప్పిపుచ్చడం శోచనీయం అన్నాడు.

జడ్జీలు పెద్ద గొంతులకీ, అభినయాలకీ మోసపోరు, మోసపోకూడదు. మనస్సు ఏం చెప్పినా, న్యాయసూత్రాల ప్రకారం సాక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని కేసు విచారణచేసి తీర్పు చెప్పాలి. వెంకటరమణ అరుపులూ, ఆరోపణలూ కేసు విచారణకి నాంది. దాన్ని సాధ్యమైనంత త్వరగా మర్చిపోయిన నేరానికీ,చట్టసూత్రాల అన్వయానికీ ఇరుపక్షాల లాయర్ల వ్యాఖ్యానం వైపు దృష్టి మరిపించటానికి తొందరపడ్డాడు జగన్నాధం

ముద్దాయి ఆత్మ సంరక్షణకోసం ముగ్గురి ప్రాణాలు తీయవలసి వచ్చిందని వెంకటరమణ వాదం, దెబ్బలాట జరిగిన చోటుకి వెళ్ళి ప్రతి విషయాన్నీ అతను శల్యపరీక్ష చేశాడు. కర్రసాము నేర్చుకున్నాడు. నీటికాలవ దగ్గిర కాపలా కాస్తున్న ముద్దాయిని కందభూమి ఖామందులు గట్టు తీసెయ్యమని అడగడం, ముద్దాయి నిరాకరించడం, కోపంతో రెచ్చిపోయి రెండోపక్షం వాళ్ళు కత్తులు తీసుకుని ముద్దాయిమీద పడడం, ముద్దాయి కర్రతో వాళ్ళని ఎదుర్కోడం, ఆ దెబ్బలాటలో ముగ్గురి ప్రాణాలు పోవడం అంతా ఎలా జరిగివుంటుందో కోర్టు హాలులో చేసి చూపించాడు. ముద్దాయికి తగిలిన దెబ్బలన్నీ వెనకనుంచి కొట్టినవే అని నిరూపించాడు. ప్రాణాలు రక్షించుకోడానికి కర్ర ఉపయోగించక తప్పలేదన్నాడు.

వెంకటరమణ ఏకాగ్రత, అతని రీతిలో తీక్ష్ణత, అతని మాటల్లో శక్తి జగన్నాధాన్ని ఆకర్షించాయి. లాయరుగా వెంకటరమణకి మంచి భవిష్యత్తు వుందనుకున్నాడు

''నా అభిప్రాయం మార్చుకోవలసిన అవసరం ఇంతవరకూ రాలేదు'' అన్నాడు జస్టిస్ జగన్నాధం

''ఇప్పటిమాట సరే, ముందు పరిస్థితి ఏమిటి?'' అంది మిసెస్ జగన్నాధం.

''నీ కూతుర్ని పెళ్లాడాడు కాబట్టి నీకింత సందేహం సుమీ! ముందు ముందు అతని ప్రాక్టీసు ఇంకా బాగుంటుంది''

''సాంబశివయ్యగారు రేపున్నారో జ్ఞాపకం వుందా?''

జస్టిస్ జగన్నాధానికి సాంబశివయ్య మీద అనుకోకుండా అకస్మాత్తుగా కోపం వచ్చింది. ఆయన రాజమండ్రిలో డిస్ట్రిక్ట్



జడ్జీగా వుండేటప్పుడు సాంబశివయ్య పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వుండేవాడు. అప్పుడప్పుడు బ్రిడ్జి ఆడడానికి జగన్నాథం ఇంటికి వొచ్చేవాడు, ఒకసారి ఆట చాలించిన తరవాత కబుర్లలో వెంకట రమణ విషయం వొచ్చింది.

"ఆడంబరమే కాని, అసలు సత్తువ లేదు" అన్నాడు సాంబశివయ్య.

"కుర్రతనం, అదే సర్దుకుపోతుంది" అన్నాడు జగన్నాథం.

"క్షమించాలి. కుర్రతనంలో చెయ్య వలసింది 'లా' పుస్తకాలు చదువుకోడం, సీనియర్ లాయర్ల పద్ధతులు చూసి నేర్చుకోడం కాని, నలుగురు పెద్దకాపుల్నీ తాగుబోతుల్నీ వెంట పడేసుకుని బజార్లో ప్రగల్భాలు కొట్టడం కాదు" అన్నాడు సాంబశివయ్య.

సాంబశివయ్య మాటల్లో కష్టంవున్నా పూర్తిగా నిజం లేకపోలేదు. వెంకట రమణ పద్ధతులు విచిత్రంగా వుంటాయి. తక్కిన లాయర్ల కివి రుచించలేదు. దానికి రెండు కారణాలు వున్నాయి. మొదటిది కొత్తగా వృత్తిలో ప్రవేశించినా ఎంతోకాలంగా అక్కడ వేళ్ళు పాతుకుపోయిన లాయర్లతో పోటీపడి నెగ్గుకుని రావడం, కొందరి సంపాదన ఇతనివల్ల క్షీణించింది. రెండవది వెంకట రమణ నోరు, అతని మనస్సులో తక్కిన లాయర్లంతా ప్రబల విరోధులు కోర్టులో కేసు నడుపుతున్నప్పుడే కాదు ఇంటా, బయటా, బజార్లోనూ, క్లబ్బులోనూ, ఎక్కడ అవకాశం వుంటే అక్కడ వాళ్ళని విమర్శించి ఖండిస్తేనేకాని అతనికి తృప్తి వుండదు అక్కడ పేరుబడ్డ

లాయర్ల ప్రతిభలో అతనికి కొంచెమైనా నమ్మకంలేదు. ఈ విషయం రహస్యంగా వుంచడానికి ప్రయత్నించకపోగా, కనిపించిన ప్రతి వ్యక్తికీ, బోధించి వాళ్ళ అభిమానం తనవైపుకి మొగ్గేలాగా ప్రయత్నించాడు. ఇదికాక తననుగురించి ప్రచారం చెయ్యడానికి కొంతమందిని తయారు చేశాడు. రిక్షాలవాళ్ళకీ, బళ్ళవాళ్ళకీ, బస్సు డ్రైవర్లకీ, కండక్టర్లకీ జీతాలిచ్చి ప్రచారం చేయించుకుంటాడని పేరు. కోర్టు వ్యవహారాల్లో రైలు దిగినవాళ్ళని తిన్నగా తన దగ్గరకి తీసుకురావడానికి కొందర్ని ఏర్పాటుచేశాడనికూడా అంటారు.

వెంకటరమణవల్ల సాంబశివయ్య ఆదాయం కించిత్తయినా తగ్గలేదు. అయినా తక్కిన లాయర్లతోపాటు తనుకూడా వెంకటరమణ పద్ధతుల్ని నిరసించాడు. అయితే సాంబశివయ్య కోపానికి కారణం వేరే వుంది. వెంకటరమణ హత్యలవంటి పెద్ద క్రిమినల్ కేసుల్లో ప్రాసిక్యూషన్ పక్షానికి వ్యతిరేకంగా పనిచేసి గెలిచేవాడు నిజానికి ఏ హత్యకేసులోనైనా ప్రాసిక్యూషన్ వైపుకన్న అపరాధి తరపున కేసు వాదించడం సులభం. ప్రాసిక్యూషన్ ఇతను అపరాధం చేశాడని నిందిస్తుంది; నిరూపించడానికి ప్రయత్నిస్తుంది. నిరూపణ అతి నిర్దుష్టంగా వుండాలి. ఏమాత్రం సందేహం వున్నా కోర్టు అపరాధివైపునే నిలబడుతుంది. ఈ పరిస్థితుల్లో సాంబశివయ్య పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గెలిచే కేసులు ఎక్కువ వుండేవికావు. ఉండాలని న్యాయస్థానాలు నడిచే విధానాలు తెలిసిన వాళ్లు అనరు. అయితే, వెంకటరమణ ఎదురుగా వాదించిన కేసుల్లో ప్రాసిక్యూషన్ గెలవనప్పుడు సాంబశివయ్య సమర్థతమీద వెంకటరమణ జరిపే దాడికి అంతూ పొంతూ వుండదు. ఈ గెలుపు తన ప్రతిభ చాటుకోడంకోసం వెంకటరమణ ఉపయోగించుకునేవాడు.

వెంకటరమణ సాంబశివయ్యని పెట్టే తికమకలు జ్ఞాపకం వొచ్చి నవ్వుకున్నాడు జస్టిస్ జగన్నాధం.

"పాపం, పెద్దమనిషికి కోపం రావడంలో తప్పులేదు" అనుకున్నాడు.

కాని, సాంబశివయ్య చెప్పినదాంతో జగన్నాధం పూర్తిగా ఏకీభవించలేదు. వెంకటరమణ తరహా నిర్దుష్టమైనది కాదన్నమాట నిజమే. కాని ఆ పద్ధతుల వల్ల అతను అయోగ్యుడయ్యాడని జగన్నాధం నమ్మలేదు. వెంకటరమణలో అట్టహాసం పాలు ఎక్కువ. పుస్తకాలు చదివి కృషి చెయ్యడంకంటే ఇతర పద్ధతులమీద ఎక్కువ ఆధారపడ్డాడు. జగన్నాధం ఉద్దేశంలో లాయరుగా ప్రావీణ్యం సంపాదించడానికి కావలసినవి అభిరుచి, కాలం. వకీలు వృత్తిలో పాతుకుపోయినవాళ్ళకి రెండూ నెమ్మదిమీద సులభంగా లభ్యం అవుతాయి. వెంకటరమణ కూడా కాలక్రమేణా 'లా' సూత్రాలకి చిలవలూ, పలవలూ కల్పించి వ్యాఖ్యానం

చెయ్యడం. ప్రతి వాదనకి పదికేసులు ఉద్ఘోషించి బలపరచడం నేర్చుకుంటాడు. అది బ్రహ్మవిద్య కాదు. కాలంకాని, మరొకటి కాని నేర్పలేని ఏదో ప్రజ్ఞ వెంకటరమణలో వుంది. అది అతన్ని వృత్తిలో చివరంటా తీసుకుపోతుంది. ఆ నమ్మకం జగన్నాధానికి వుంది. ప్రతి సారీ వెంకటరమణ తనముందు కేసు వాదించినప్పుడు అది బలపడింది. అయితే, ఆ ప్రజ్ఞ ఏమిటో ఇదమిద్ధమని జగన్నాధం నిర్ణయించుకో లేకపోయాడు. సాంబశివయ్యకి విప్పి చెప్పడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. సాంబశివయ్య జగన్నాధం చెప్పిందంతా విని అన్నాడు

"మీరు పైపై మెరుగులు చూపి మోస పోతున్నారు"

"మెరుగులే కాదు సాంబశివయ్య గారూ! బాగా ఆర్జిస్తున్నాడనికూడా విన్నాను" అన్నాడు జగన్నాధం.

"ఇప్పుడొస్తుందేమో కాని, అట్టే కాలం నిలబడదని నా ఉద్దేశం" అన్నాడు సాంబశివయ్య; అక్కడ వున్నవాళ్ళంతా ఔనన్నారు. ఆ విషయం ఇప్పుడు మిసెస్ జగన్నాధం గుర్తుకి తెచ్చింది.

"ఇవన్నీ పెళ్ళిముందు ఆలోచించ లేక పోయావా!" అన్నాడు జస్టిస్ జగన్నాధం.

"తండ్రీ, కూతురూ కలిసి నామాట పడనిస్తేనా"

అది నిజం కాదని ఆవిడకి తెలిసినా ఆయువ కోపంతో అంది.

నిర్మల వెంకటరమణని పెళ్ళి చేసుకుంటానని చెప్పినప్పుడు జగన్నాధం 'తొందరపడి చేసుకోవద్దు, బాగా ఆలోచించుకో' అన్నాడు.

వెంకటరమణ తండ్రి రాజమండ్రీ దగ్గిర చిన్న పల్లెటూళ్లో కరణం. పన్నెండేళ్ళు వచ్చేవరకూ వెంకటరమణ అక్కడే పెరిగాడు, తరువాత చదువుకని రాజమండ్రీ వచ్చాడు. అక్కడ బి. ఏ. ప్యాసయి, వాల్టేరులో 'లా' పరీక్షకి చదివాడు. అతను ఎరిగిన జీవితం, పెరిగిన వాతావరణం నిర్మలకి కొత్త. నిర్మల చిన్నతనం నుంచీ ఇంగ్లీషు స్కూల్లో చదువుకుంది. అయిదేళ్ళప్పుడే కోటగిరి నర్సరీ స్కూల్లో చేరింది. తరవాత లవ్‌డేల్‌లోనూ, బ్రిక్స్ స్కూల్లోనూ చదివి ప్రెసిడెన్సీ కాలేజీలో డిగ్రీకోర్సు చదివింది.

"వెంకటరమణ తెలివయినవాడు; మంచివాడు. కాని పెళ్లాడే ముందు చూసుకోవలసినవి ఈ రెండే కాదు." అన్నాడు కూతురితో జగన్నాధం.

"పరవాలేదు" అంది నిర్మల.

మిసెస్ జగన్నాధానికి నిర్మల పెళ్లి చేసుకుంటాననడమే బ్రహ్మానందమయింది. రెండేళ్ళుగా కూతురు పెళ్ళి వాయిదా వేస్తూంది. త్వరగా చేసుకోకపోతే వయసుమీరి పోతుందని ఆవిడ బాధ, పైగా వయసువచ్చిన పిల్ల పెళ్ళి

వొద్దనడం ఆవిడలో శంక రేపింది. మద్రాసులో ఉన్నప్పు డెవర్నయినా ప్రేమించి వంచించ బడిందేమోనని అను మానం వేసింది. ఎంత అడిగినా నిర్మల ఏమీలేదనే సమాధానం ఇచ్చింది. మిసెస్ జగన్నాధం మట్టుకు పార్టీసాకు కల్పించి తెలిసిన యువకుల్లో యోగ్యులయిన వాళ్ళని నిర్మల కలుసుకునేటట్టు చేస్తూనే వుంది. వాళ్ళందర్నీ కాదని నిర్మల ఇతన్ని పెళ్లి చేసుకుంటాననడం ఆవిడకి ఆశ్చర్యం వేసింది వెంకటరమణని నిర్మల కలుసు కున్నది పార్టీల్లో కాదు. అతన్ని డిస్ట్రిక్ట్ జడ్జిగారింటో పార్టీలకి ఎప్పుడూ పిలవ లేదు. వెంకటరమణ మీద ఏర్పడ్డ అభి మానంవల్ల జగన్నాధం అతన్ని పిలిచి ఎప్పుడయినా ప్రోత్సహిస్తూ ఉండేవాడు. వెంకటరమణ ఏదయినా సెలవురోజున జడ్జిగారింటికి వెళ్తూవుండేవాడు. ఒకసారి వెళ్లినప్పుడు నిర్మలని కలుసుకున్నాడు. ఆమె అతనిని ఎంతో ఆకర్షించింది. అప్పట్నించీ ఆమెతో మాట్లాడడంకోసం తరచూ జడ్జిగారింటికి వెళ్ళడం మొదలు పెట్టేడు. కొంతకాలానికే వాళ్ళ స్నేహం ప్రేమగా మారి పెళ్లి చేసుకోడానికి నిశ్చయం చేసుకున్నారు.

"ఇద్దరికీ ఇష్టమయితే నాకూ ఇష్టమే" అన్నాడు జగన్నాధం. మిసెస్ జగన్నా ధానికి ఇంగ్లాండు వెళ్ళి వచ్చిన అల్లుడి మీద వున్నా ఈ పెళ్లికి అడ్డు చెప్పలేదు. ఆవిడకి కావలసింది కూతురికి సౌఖ్యం, డబ్బుండటం. వెంకటరమణకి కొద్దో గొప్పో ఆస్తివుంది. ప్రాక్టీసులో ప్రవేశించి నాలుగేళ్ళు నిండకుండానే బోలెడు సంపా దిస్తున్నాడు! చాల తెలివయినవాడని జగన్నాధం ఎప్పుడూ చెపుతూనే వున్నాడు. అంతకుమించి అప్పుడు ఆవిడ ఆలోచించలేదు ఇప్పుడు కూతురు అదే పనిగా మొగుడికి ఉద్యోగం చూడమని రాయడంతో ఆవిడలో మునుపులేని శంకలు బయల్దేరాయి. వెంకటరమణ సంపాదనతో సంసారం గడవడం లేదేమో? నిర్మలకి అతనితో సామరస్యం కుదరడంలేదేమో? ఆ చిన్న ఊళ్ళో నిర్మల వుండలేకపోతుందేమో? ఈ ఆలో చనల్తో ఆవిడ హృదయం ఆర్ద్రమై పోయింది. చేతిలో టీ కప్పు బల్లమీద పెట్టి మొగుడి దగ్గిరకి జరిగింది.

"పెళ్ళయాక నిర్మల ఇంటికి వెళ్ళనే లేదు. ఈ దసరాకి వెళ్దామా?" అంది.

జస్టిస్ జగన్నాధం ఆమె కళ్ళల్లోకి చూశాడు ఉబికివస్తున్న కన్నీళ్ళు అపు కుంటున్నట్టనిపించింది. ఆవిడ మన స్సులో ఆందోళన గ్రహించాడు. హైకోర్టు జడ్జీ అయి హైదరాబాదు కొచ్చిన ఈ మూడేళ్ళల్లో అల్లుడి ఇంటికి వెళ్ళడమే పడలేదు. ఒకసారి కాన్పుకి కూతురే అక్కడికి వచ్చింది. తరవాత ఏదో ఒక అడ్డు రావడం, పెట్టుకున్న ప్రయాణం పడకపోవడం జరిగింది

"సరే వెళ్దాం" అన్నాడు జస్టిస్



జగన్నాధం.

"సుశీ తలుచుకుంటే ఏమయినా సాధించగలదని నేను చెప్పలేదూ!" అన్నాడు రంగారావ్.

"మీరుకూడా రాకూడదూ! అక్కణ్ణుంచి వెంకట్ పొలాల్లోకీ, తోటల్లోకీ పోవచ్చు. హాయిగా వుంటుంది" అంది మిసెస్ జగన్నాధం.

"థాంక్స్. సుశీ! ఇంకెప్పుడయినా చూద్దాం ఇప్పుడు నేను ఇక్కణ్ణుంచి ఒక్కరోజు కూడా కదలడానికి వీల్లేదు" అన్నాడు రంగారావు.

"మా బదులుకూడా మీరే ఆనందించి రండి" అంది మిసెస్ రంగారావు.

* *

అల్లుడిలో జస్టిస్ జగన్నాధానికి ఏదో ప్రబలమైన మార్పు కనిపించింది. ఎంత ప్రయత్నించినా దేంట్లోనో అంతుపట్ట లేదు. ఏదో మార్పు. ఏదో వెలితి అంతే. వెంకటరమణతో మాట్లాడదామని ఆఫీసు దగ్గిరకి వెళ్ళాడు జస్టిస్ జగన్నాధం. వెంకటరమణ లోపలిగదిలో కూర్చుని రాసుకుంటున్నారు ఒక గుమాస్తా బయట వరండాలో రికార్డు తిరగేస్తున్నాడు అంతా ప్రశాంతంగా, నిర్మలంగా వుంది. ఆయనకి ఆశ్చర్యం వేసింది. వెంకట్ ఆర్భాటం ఏమయిపోయింది? అతని అనుచరులూ, అనుయాయులూ, క్లయంట్లూ, టవుట్లూ ఎక్కడ? జస్టిస్ జగన్నాధానికి ఆఫీసు లోపలికి వెళ్ళ బుద్ధి కాలేదు. తిరిగి వెళ్ళిపోయాడు.

ఇంటిదగ్గిర సాంబశివయ్య ఆయన కోసం కాచిపెట్టుకుని ఉన్నాడు. అతన్ని చూడగానే ఆయన మొహం వికసించింది. గడిచిన రోజుల కబుర్లు చెప్పుకున్నారు. ఆమధ్య జరిగిన బ్రిడ్జి టూర్నమెంట్సులో

చేతులూ, ఆటలూ గురించి విమర్శించారు. ఊళ్ళో లాయర్లని గురించి మాట్లాడుకున్నారు. తరవాత వెంకటరమణ ప్రసక్తి వొచ్చింది.

"సంపాదన అంతలేదేమోకాని, మన వాడు ఒక దారిన పడుతున్నాడు" అన్నాడు సాంబశివయ్య.

"ఆర్జన లేకుండా ఏంచేసి ఏం లాభం" అన్నాడు జస్టిస్ జగన్నాధం.

"వెంటనే సంపాదించకపోతే పస్తుండాలా?"

"అలాకాదు, అయినా ఈ తాపత్రయం అంతా డబ్బుకోసమేగదా"

"అదే వొస్తుంది డబ్బు నెమ్మదిగా. పెళ్ళి పుణ్యమా అని పొగరూ, దురుసుతనం తగ్గాయి. క్రమంగా అన్నీ అలవడతాయి" అన్నాడు సాంబశివయ్య.

జస్టిస్ జగన్నాధం మెదడులో చరచినట్టయింది. సాంబశివయ్య వెళ్ళి వస్తానన్న మాటలు సరిగా వినిపించుకోనే లేదు. అతను చెప్పిన విషయాలగురించి ఆలోచించడంలో మునిగిపోయాడు.

ఇలా జరుగుతుందనే భయం జస్టిస్ జగన్నాధానికి మొదటినుంచీ వుంది. అప్పుడు ఉద్రేకంలో బాగా ఆలోచించకుండా పెళ్ళి చేసుకుంది నిర్మల ఆమె సంస్కారం వెంకటరమణ సంస్కారానికి భిన్నమైంది. అతని పద్ధతులు ఆమెకు సరిపడవని తనకు తెలుసు. అందుకే వెంకటరమణమీద ఎంత అభిమానమున్నా నిర్మల పెళ్ళాడతా నన్నప్పుడు ఆయన వెంటనే ఒప్పుకోలేదు. ఇప్పుడు తన సందేహాలన్నీ నిజరూపందాలుస్తున్నాయి. వెంకటరమణలో వున్నదని నమ్మి, తను ఎంతోకాలంగా పరిశోధిస్తున్న ప్రత్యేకతని, ప్రతిభని, ప్రజ్ఞని సాంబశివయ్య యధాలాపంగా 'పొగరు', 'దురుసుతనం' అన్నాడు. తను ఆత్మవిశ్వాసం అంటాడు. ఓటమి అంగీకరించలేని గుండె నిబ్బరం. కార్యసాఫల్యంకోసం పూనిన దీక్ష. వెంకటరమణ ఆడంబరం, ప్రచారం లక్ష్యసిద్ధికి పునాదులు. అతను ప్రతి కక్షులమీద చూపించే నిర్లక్ష్యం, కోపం, అసహ్యం కార్యసాధనకి మేడమెట్లు. నిర్మల వెంకటరమణని అర్థం చేసుకోలేదు. స్వార్థంతో అతన్ని తన పద్ధతుల్లోకి తీసుకురావడానికి ప్రయత్నించింది. ఈ ఘర్షణలో అతని ప్రత్యేకత అణగారిపోయింది. అనాలోచితంగా అతని భవిష్యత్తు ధ్వంసంచేసింది నిర్మల. ఇప్పటికయినా మించిపోయిందేమీలేదు. కూతురికి అంతా విపులంగా బోధించాలి

"నిర్మల్!" అని పిలిచాడు.

నిర్మల వచ్చింది.

"నిన్నొక్కమాట అడగాలనుకొంటున్నాను."

నిర్మల మాట్లాడలేదు.

"వెంకట్ ప్రాక్టీసు ఎలా వుంది?"

నిర్మల కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

పక్కకి తిరిగి విదిలించుకుంది.

"ఇదంతా నువ్వు చేసుకున్నదే' అందామనుకున్నాడు.

"ఏమన్నా వొస్తుందా?" అన్నాడు.

"మునుపటిలాగా లేదు" అంది నిర్మల.

"ఏం?" అన్నాడు.

"ఏమో."

"నరసయ్యా, రాఘవులూ కేసులు తీసుకురావడం లేదా?" జస్టిస్ జగన్నాధం సిగ్గుతో కుదించుకుపోయి అడిగాడు. ఆయనకి టవుట్సు, కోర్టు పక్షులు అంటే అసహ్యం. అయినా అల్లుడి పద్ధతులకి అడ్డు తగలడం యిష్టంలేక చూసీ చూడ నట్టు ఊరుకున్నాడు.

"ఇప్పుడు వాళ్ళని జేర్చడంలేదు" అంది నిర్మల.

"ఏం?"

"ఏమో!"

తరవాత ఏమడగాలో ఆయనకి తోచ లేదు. నిర్మలే అంది.

"ఏదైనా ఉద్యోగం చూసిపెడితే బాగుంటుంది."

"ఉద్యోగం ఎందుకు నిర్మల్!" అన్నాడు జస్టిస్ జగన్నాధం.

"ఎంతకాలం వున్నది తింటూ కూర్చోడం?"

"అసలేమీ రావడంలేదా?"

"మునుపటిలాగా ప్రయత్నం చేస్తు న్నట్లు లేదు."

"నువ్వు అతని పనిలో జోక్యం చేసుకోకూడదు నిర్మల్!" అన్నాడు జస్టిస్ జగన్నాధం.

"నేనే చేశాను?"

"వెంకట్ పద్ధతులు మార్చడానికి ప్రయత్నించకూడదు."

"ఏ పద్ధతయితే నాకెందుకు ఇంత సంపాదించి పడెయ్యమంటాను. అంతే! ఇప్పుడు ఇద్దరిమే కాదుగా, పాపతో కలిసి ముగ్గురం"

"ఔను" అన్నాడు జగన్నాధం.

"నాకంతా అయోమయంగా వుంది. వెంకట్ ఇలా మారిపోతాడనుకోలేదు" అంది నిర్మల.

అప్పుడే వెంకటరమణ ఆఫీసునుంచి వచ్చాడు

"నేను భోజనాల సంగతి చూస్తాను" అని నిర్మల వెళ్ళిపోయింది. వెంకట రమణ మామగారితో కబుర్లలోకి దిగాడు.

"ప్రాక్టీసు ఎలా వుంది?" జస్టిస్ జగన్నాధం అడిగాడు.

"బాగానే వుంది" అన్నాడు వెంకట రమణ.

"ఎంత వస్తూంది?"

"అట్టే రావడంలేదు"

"ఏం?"

"ఇప్పుడు మేజెస్ట్రేట్ కోర్టుకి వెళ్ళ డంలేదు ప్రొహిబిషన్ కేసులన్నీ వదిలే శాను" అన్నాడు వెంకటరమణ.

"నీపని చాలమటుకు యస్. యస్.

యమ్. కోర్టులో నేగదా! అక్కడికి వెళ్ళక పోతే ఎలా'' జస్టిస్ జగన్నాధం అడిగాడు.

''ఇక్కడ కోర్టుల్లో వాతావరణం నాకు సరిపడడంలేదు హైదరాబాదు వొచ్చేదా మనుకుంటున్నాను'' మునుపు వెంకటరమణ ఇలా మాట్లాడితే జస్టిస్ జగన్నాధం ఆశ్చర్యపోయేవాడు ఇప్పుడు ఈ మాటలు అతని నోటికి అతికినట్టు సరిపోయాయి. వెంకటరమణ రూపులోనూ, రీతిలోనూ కూడా ఎంతో మారిపోయాడు. సౌమ్యత, నెమ్మది అలవడ్డాయి.

''ఇక్కడి వాతావరణానికే మొచ్చింది!'' అన్నాడు జస్టిస్ జగన్నాధం.

''మీరు జడ్జీగా బెంచీమీద కూచుంటారు కాబట్టి మాపాట్లు తెలియవు. నానా గడ్డీ కరచి, అన్ని రకాలవాళ్ళనీ పట్టుకుని పాకులాడాలి మేం. నే నిన్నాళ్ళు పని సంపాదించడానికి ఎన్ని అవతారాలు ఎత్తానో తెలిస్తే మీకు అసహ్యం వేస్తుంది'' అన్నాడు వెంకటరమణ.

తనకి తెలిపిన విషయాలు గుప్తంగా ఉంచడమే ఉత్తమం అని తోచింది జస్టిస్ జగన్నాధానికి.

మళ్ళీ వెంకటరమణ అన్నాడు.

''పాపం, నిర్మల్ మాత్రం ఎంత కాలం నాకోసం ఇక్కడ పడి మగ్గుతుంది. తనకోసమైనా హైదరాబాదు వచ్చెయ్యాలి''

నిర్మల వచ్చి భోజనాలకి లేవమంది. జస్టిస్ జగన్నాధం తరవాతతింటానన్నాడు.

ఆయనకి ఇప్పుడు పరిస్థితి అర్థమైంది. ఇందులో నిర్మల తప్పులేదు. ఆమె వెంకటరమణని మార్చడానికి ప్రయత్నం చెయ్యలేదు. అతని మార్పు స్వయంకృతం నిర్మలమీది ప్రేమవల్లా, ఆమె సంస్కారంమీద గౌరవంవల్లా తన నాగరికతా, సంస్కారంమీద చిన్న చూపు వల్లా పుట్టింది. ఈ మార్పులలో అతని ప్రత్యేక ప్రతిభ అడుగంటిపోయింది. తిరిగి తెచ్చుకోడానికి ప్రయత్నించమని చెప్పి ప్రయోజనంలేదు; చెప్పినా వింటాడనే ఆశలేదు; విన్నా అది వస్తుందనే నమ్మకమూలేదు.

జస్టిస్ జగన్నాధం కుర్చీలోనుంచి లేచి భోజనాలగదిలోకి వెళ్ళాడు. వెంకటరమణ భోజనం అయిపోయింది. నిర్మల ఏవో సర్దుతూంది.

''వెంకట్ ఎక్కడ?'' ఆయన అడిగాడు.

''కోరుకి వెళ్ళిపోయారు'' అంది నిర్మల.

''నిర్మల్!''

నిర్మల చేతిలో పళ్ళెం సైడ్‌బోర్డ్ మీద పెట్టి వెనక్కి తిరిగి చూసింది.

''మీరు మాతో హైదరాబాదు వొచ్చెయ్యండి. వెకంట్‌కి ఉద్యోగం కోసం ప్రయత్నం చేద్దాం'' అన్నాడు జస్టిస్ జగన్నాధం.

———